# ది గ్రేట్ హీరో

**కథానిక**

డాక్టర్ ఎ. విజయలక్ష్మి

అర్ధరాత్రి దాటాక ఫోన్ మ్రోగింది. అంతకు ముందే కేస్ డెలివర్ అయ్యాక లోపలికి వచ్చి పడుకున్నాను. బద్ధకంగా కళ్ళుమూసుకునే చెయ్యిచాచి ఫోన్ అందుకున్నాను.

"డాక్టర్ గారా?" ఎవరో అడుగుతున్నారు.

"అవును" కొంచెం మెలకువ తెచ్చుకుని జవాబిచ్చాను.

"మా పిన్ని స్పృహతప్పి పడిపోయింది. మీరు వెంటనే వచ్చి చూడాలి. గాంధీనగరంలో ఒంటి మామిడి జంక్షన్ దగ్గర." అతను యింటి గుర్తులు చెప్తున్నాడు.

"నేను బయటికి విజిట్స్‌కి రాను. సారీ!" విచారం ధ్వనిస్తున్న స్వరంతో చెప్పి ఫోన్ పెట్టేసాను. పేషెంట్ పరిస్థితి బాగులేనప్పుడు, నేను బయటికి విజిట్స్‌కి రానని చెప్పి తప్పించుకోవడం బాధ్యతారహితమే. కాని అర్ధరాత్రి పేషెంట్‌ని వెదుక్కుని వెళ్ళి వైద్యం చేసేంత ఆదర్శమూర్తిని కాను.

రాత్రిళ్ళు పదిసార్లు లేవడం, పడుకోవడం అలవాటయిపోయి నందువల్ల ఫోన్ పెట్టేసిన మరు నిమిషంలో నిద్రలోకి జారాను. మళ్ళీ కొద్ది నిమిషాల్లోనే ఫోన్ రింగయింది. విసుగ్గా చెయ్యి చాచాను.

"డాక్టర్ గారేనా?" ఇందాకటి గొంతే.

"ఎస్"

"మేడమ్! కారు పంపిస్తాం. మీరో సారి రావాలి". గొంతులో ఆదుర్దా లేదు. రవ్వంత అర్థింపు మాత్రం వుంది. అప్పటికే పేషెంట్‌ని చూడడానికి రానన్నందుకు న్యూనతగా వుందేమో, అతనలా అనేసరికి వెనుక ముందాడుతున్న మనిషిని వెనక్కు నెట్టేసి, నాలోని డాక్టరు ముందు కొచ్చింది.

"అలాగే, రండి" ఎన్నడూ పగలు కూడ బయటికి విజిట్స్‌కి వెళ్ళని నేను అర్ధరాత్రి బయటికి వెళ్ళడానికి అంగీకారం తెలిపాను. నా రూల్సు, యిష్టాయిష్టాల కంటే పేషెంట్ ముఖ్యమనిపించిదా క్షణంలో. క్షణంలో, సగం సేపు కూడ గడవలేదు. యింకా ఫోన్ నా చెవి దగ్గరే వుంది.

"యిందాక ఫోన్ చేస్తే బయటికి రానన్నారు. డాక్టరయ్యుండి మీరలాగేనా జవాబు చెప్పేది? మీరు తప్పితే యింకెవరూ డాక్టర్లు లేరనుకుంటున్నారా యిక్కడ?" ఒక్క సారిగా నిద్రమత్తు వదలి పోయింది. కాని అతని దురుసుకి నా నోటంట మాట రాలేదు. అతని ధూర్తత్వం చూస్తూంటే నిజంగా పేషెంట్ కోసం ఫోన్ చెయ్యలేదని అర్థమయింది.

"ఒక్క అరనిమిషంలో డాక్టర్ని తెచ్చుకోగలం. యింకెవరూ డాక్టర్లు లేరనుకోకు". అతని అసందర్భ

ప్రలాపం వింటున్నాను కాని ఏంమాట్లాడాలో తోచలేదు. "అరనిమిషంలో డాక్టర్ని తెచ్చుకోగలవాడివి, అర్థరాత్రి నిద్రలేపి మరీ అంకమ్మ శివాలెందుకు పెడుతున్నావయ్యా మహానుభావా!" అనుకున్నాను.

"డాక్టరయుండి పేషెంట్‌కి బాగా లేనప్పుడు బయటికి రానంటావా;" అతని జబర్దస్తీచూచి కోపమొచ్చింది.

"నా యిష్ట మయితే వస్తాను లేకపోతే లేదు". నేనింక చెప్తూనేవున్నాను.

"యూ షటప్" అని ఫోన్ పెట్టాసాడతను. బిందెడు పేడ నీళ్ళు నా ముఖాన గుమ్మరించినట్లయింది. పని గట్టుకుని నన్నింతగా అవమానించిన వాడెవరో తెలియటం లేదు. అస్థిమితంగా లేచి లైట్‌వేసి టైమ్ చూచాను. మూడయింది.

"ఏమిటి? ఎవర్ని తెల్లా వారకుండానే తిడతున్నావు?" అతను 'షటప్' అనగానే అసంకల్పిత ప్రతీకార చర్యలా నా నోటి నుండి కూడ 'షటప్' అని వచ్చింది. అది విని శ్రీవారు కళ్ళు సగం తెరచి అడిగారు.

"ఏం లేదు మీరు పడుకోండి." పడుకోండని చెప్పాను గాని అస్థిమితంగా వున్న నా మనసు ఊరుకోలేదు. ఒక నిమిషం కూడ పూర్తిగా గడవకుండానే

# మహాగాయకుని అంతర్ధానం

## శశికాంత్ శాతకర్ణి

బాల్కని పిట్ట గోడ మీద
రాత్రి వెన్నెలకు విశాలంగా విరిసిన
టెర్రేస్ మీద
నీళ్ళ పంపు వంపు మీద
ఆదివారం బద్ధకంగా
ఒళ్ళు విరుచుకుంటుంది
పక్కమీద అటుఇటు కదులుతూ
నేను మూడోఝాము నిద్రతీసేసరికి
ఆలస్యంగా వచ్చిన ఉదయం
మధ్యాహ్నంలోకి పాకింది
నిశ్శబ్దంగా గర్జించే ఒంటరితనం
నా మీద చేసే దురంతాలను
తిట్టుకొంటూ కాలకృత్యాలు
తీర్చుకొన్నాను

మధ్యాహ్నం భోజనం ముగించుకొని
భుక్తాయాసం తీర్చుకొంటూండగానే
నా గది కిటికీ ఊచల మీద
సాయంసంధ్య వ్రేలాడింది
చెవులు చిల్లులు పొడిచే
లౌడ్‌స్పీకర్‌లాంటి గొంతుకతో
పగలంతా కాంతికృతుల కచేరి చేసిన
మహాగాయకుని పాట విందామని
తలుపు తెరచిన నాకు
చీకటి నిండిన ఆకాశం ఎదురైంది
ఆ గాయకుడూ లేడు
అతని జాడలూ లేవు
తూరుపు మందిరంలో నిరీక్షిస్తున్న
శ్రోతృ మహాసాగరం మాత్రం
ఊరికే కళవళ పడుతోంది!!

తనని లేపి జరిగింది చెప్పాను. అంతా విని కులాసాగా నవ్వి "ఎవరో పనిలేని పిచ్చి రాస్కెల్. ఆలోచనల్తో బుఱ్ఱ బ్రద్దలు గొట్టుకోక హాయిగా పడుకో" అని ముసుగు బిగించారు. నేనింత అవమానాగ్నిలో కాలిపోతూవుంటే ఏం పట్టనట్టు. అదేదో చాల చిన్న విషయంలా తీసేసి పడుకోమంటే నమిలిమింగేద్దామన్నంత కోపమొచ్చింది.

ఆలోచనల్తో మరి నిద్ర పట్టలేదు. 'యూ షటప్', 'యూ షటప్'. అతని స్వరం నా చెవుల్లో గింగురు మంటూనే వుంది. కాసేపు అయాక చటుక్కున ఆ స్వరాన్ని ముందెప్పుడో విన్నట్లనిపించింది. ఎక్కడ విన్నాను? ఎప్పుడు విన్నాను? ... ఎంత ఆలోచించినా గుర్తుకు రావడం లేదు.

నేను ఆలోచనల్లో వుండగానే భళ్ళున తెల్లారింది. కళ్ళు, మనసు మండిపోతున్నా లేచి రొటీన్‌లో పడ్డాను, జడేసుకుని, బొట్టు సరిచేసుకుంటూ వుండగా జటనెవరో గుంజినట్లయి కోపంగా వెనక్కు తిరిగాను,

"హాయ్ శశీ! ఏమిటే యింత ప్రొద్దున్నే ఊడిపడ్డావు?" అన్నాను నా ఫ్రెండ్ శశిరేఖను చూచి,

"మీ వెనక వీధిలో డి. ఎస్. పి. వుంటున్నాడులే, ఆయనతో పనుండి వచ్చాను" అంది శశి.

"ఏమిటే డి. ఎస్. పి. తో పని? కొంపదీసి మా అన్నయ్య మీదేమైనా కంప్లై యివ్వడాని కొచ్చావా ?"

"మీ అన్నయ్యలాంటి వాళ్ళమీద డి. ఎస్. పి. కి కాదు గదా డి. ఐ. జి. కి కంప్లైంట్ యిచ్చినా లాభం లేదు. ఆయన విషయం ఎప్పుడో వదిలేసానులే". చిలిపిగా చూచింది శశి.

"ఏయేయ్! భోలా శంకరుడి లాంటి మా అన్నయ్య నంత మాటనడానికి నీకు నోరెలా వచ్చిందే? కమాన్ టేక్ బాక్ యువర్ వర్డ్స్". నా గద్దింపుకు నవ్వింది శశి.

"అది కాదే, యీ కాలేజీ కుఱ్ఱాళ్ళ బాధ భరించ శక్యం కాకుండా వుందనుకో". అంతలోనే విచారంలో మునిగిపోయింది శశి. దాని విచారం చూచి నవ్వొచ్చింది నాకు.

"ఏయ్! నీకేమైనా మతిపోయిందా? వచ్చే సంవత్సరం నీ కూతురు కాలేజీలో చేరుతుంది. యిప్పుడు నీకు కాలేజీ కుఱ్ఱాళ్ళ బెడదేమిటే"?.

"అదేగదే నా బాధ! చదువుకునేప్పుడు ఎవరితోనూ పల్లెత్తు మాటనిపించుకోకుండా గౌరవంగా యూనివర్సిటీ నుంచి బయటపడ్డాను. యిప్పుడీ చెత్తాకారీ వెధవల్తో ఫోనులో తిట్లు తింటూంటే సిగ్గుతో నా ప్రాణం పోతూందనుకో". 'ఫోన్‌లో తిట్లు' అనగానే గతుక్కుమన్నాను. ఆత్రుత ఆగింది కాదు.

"ఏమిటే? ఏమయింది? అసలు విషయం చెప్పు". శశి జరిగిన విషయమంతా చెప్పుకొచ్చింది. శశి అక్క కూతురు ఇందిర, శశిదగ్గరే వుండి ఇంటర్ చదువుతూంది. ఆ అమ్మాయి క్లాసమేట్స్ అబ్బాయిలు ఇందిరకోసం ఇంటికి వస్తూంటేనూ, రోజుకి పదిసార్లు ఫోన్ చేస్తూంటేనూ కాస్త చెక్ చేసింది! అక్కడికీ ముందు చాల మృదువుగానే

చెప్పినా ఫోన్‌లో వాళ్ళు రాష్‌గా మాట్లాడడంతో తనూ కొంచెం కటువుగా జవాబిచ్చి కాస్త ఒళ్ళు దగ్గర బెట్టుకుని ప్రవర్తించమందట. దాంతో రెండు రోజుల్నుంచి ఒకటే ఫోనులు. ఫోన్‌లో శశి కంఠం వినగానే తిట్లు మొదలు పెట్టడం. విశ్వప్రయత్నం మీద నాల్గెవరో ఆరా తీసి డి. ఎస్. పి. కి రిపోర్టిచ్చి వచ్చింది శశి. శశి చెప్పింది విన్నాక, శశితో పోల్చిచూస్తే నాకు జరిగిన పరాభవం చాల తక్కువే.

"దాదాపు తమ తల్లి వయసు స్త్రీతో వాళ్ళెంత దరిద్రంగా మాట్లాడగలుగుతున్నారంటే నాకాశ్చర్యంగా వుంది. ఇంత చిన్నపిల్లలు, ముక్కుపచ్చలారని కుర్రాళ్ళు తమతోటి ఆడపిల్లల్ని ఏడిపించడానికో, లేక వాళ్ళ స్నేహాన్ని పొందాలనే పట్టుదలతోనో, వాళ్ళ తల్లుల్నీ కూడ తిట్టేంత ధైర్యం చేస్తున్నారంటే చాలా బాధగా వుంది. నా కొడుకులే పెడదారిన పోతున్నట్లనిపించి ఆందోళనగా వుంది". శశి చెప్తూనే వుంది. నేను తెల్లవారు జామున ఫోనులో విన్న కంఠాన్ని గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. అంతలో ఫోన్ మ్రోగింది.

"ప్రియవుందా?" దురుసుగా అడిగిందో మగ కంఠం. ఆ స్వరాన్ని విన్న వెంటనే గుర్తొచ్చింది నేను తెల్లవారు ఝామున విన్నది. అప్పుడప్పుడూ నా మేనగోడలు ప్రియకోసం అడుగుతున్న కంఠం అదేనని ప్రపంచమంటే ఏమిటో తెలిసీ తెలియని వయసులోని ప్రియ స్నేహాలకు హద్దులుగీసే ప్రయత్నంలో అబ్బాయిలెవరైనా ఫోన్ చేస్తే కొన్ని సార్లు హాస్పిటల్లోనించి ఫోన్ ఇంట్లోకి పంపకుండా మృదువుగా ప్రియలేదని చెప్పి ఫోన్ పెట్టేసేదాన్ని, క్షణంలో సగం సేపట్లో అదంతా గుర్తొచ్చింది.

"ప్రియలేదు బాబూ!" సాధ్యమైనంత సౌమ్యంగా చెప్పాను. దానికి బదులుగా వచ్చిన బెదిరింపు విని నా మెదడు మొద్దుబారి పోయింది. అతను అన్నది మిగతాదేమీ వినపడలేదు. "మేం ఎవరమో తెలుసా? స్టూడెంట్స్‌మి" - అదే చెవుల్లో గింగురుమంటూంది.

"ఎవరే?" శశి అడుగుతూంది.

"ది మోస్ట్ ఆనరబుల్ అండ్ ద హైయస్ట్ డిగ్నిటరీ ఇన్ ద వరల్డ్".

"ఎవడే వాడు?" శశి అత్రుతగా అడిగింది.

"ది గ్రేట్ హీరో"

"ఎవరే?" శశి విసుగ్గా చూచింది.

"స్టూడెంట్".

## ఒక మెరుపు

వెందడుకు పెట్టిన
పదును
ఏ సందేహాన్నైనా
కోస్తుంది!
ఎడదకు చుట్టిన
జాలి
ఏ కష్టాలనైనా
మోస్తుంది.

మిరియాల రామకృష్ణ